

దారి దోపిడీ ముఠా అరెస్టు

దారి దోపిడీకి పాల్పడుతున్న ఐదుగురు హిజ్రాలు, ఇద్దరు యువకులను చౌటుప్పల్ మండలంలో పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



'ఏపూరు' అద్భుతం

ఆత్మకూర్(ఎస్) మండలంలోని ఏపూరు పంచాయతీ పనితీరు అద్భుతమని ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర బృందం కొనియాడింది. - 8లో



విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు..

విద్యుదాఘాతంతో చిలుకూరు, బీబీనగర్ మండలాల్లో ఇద్దరు రైతులు మృతిచెందారు. - 8లో

న్యూస్‌రీల్

వారోత్సవాలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

వలిగొండ: బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా వలిగొండలో 17వ తేదీ వరకు నిర్వహించనున్న సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు కోరారు. మంగళవారం వలిగొండ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో కొనసాగుతున్న శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందూ ముస్లింల గొడవగా సృష్టించే బీజేపీ మతోన్మాద ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మాటూరి బాలరాజు, సిర్పంగి స్వామి, కాల్యూరి రామ్‌చంద్రం, కూర శ్రీనివాస్, దండం నర్సిరెడ్డి, కందడి సత్తిరెడ్డి, ఈర్లపెల్లి ముత్యాలు, నర్సింహ పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల రాష్ట్ర కమిటీ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మంచిర్యాల డిపోకు చెందిన రెంక రవి, జనరల్ సెక్రటరీగా వరంగల్ డిపోకు చెందిన వంగ రాజు, కోశాధికారిగా సిరిసిల్ల డిపోకు చెందిన రాజునాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోదాడ డిపోకు చెందిన దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా మహబూబాబాద్ డిపోకు చెందిన శ్రావణ్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా యాదగిరిగుట్ట డిపోకు చెందిన బూడిద నరేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాదగిరిగుట్ట డిపో అద్దె బస్సు డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు బూడిద నరేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర యూనియన్‌ను ఎన్నుకున్నట్లు అద్దె బస్సు డ్రైవర్ల నూతన సంఘం సభ్యులు తెలిపారు.

ప్రజారంజక పాలన సాగిస్తున్న కేసీఆర్



బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట : గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను అమలు చేస్తూ సీఎం కేసీఆర్ ప్రజారంజక పాలన సాగిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలో మోటకొండూర్, ఆత్మకూరు(ఎం) మండలాల్లోని ముత్తిరెడ్డిగూడెం, కామునిగూడెం, నాంచారిపేట తూర్పుబాయి గ్రామాలకు చెందిన సుమారు 400మంది కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్, బొట్ల యాదగిరి, జెడ్పీటీసీ పల్లా వెంకట్ రెడ్డి, రైతు బంధు జిల్లా సభ్యులు కోరే భిక్షపతి, మండల కన్వీనర్ యాస ఇంద్రారెడ్డి, ఎంపీటీసీ యాస కవిత, సర్పంచ్‌లు తదితరులున్నారు.

ఆంజనేయస్వామికి ఆకుపూజ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి అర్చకులు ఆకుపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంజనీ పుత్రుడిని సింధూరంతో అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. అనంతరం క్షేత్రపాలకుడికి ఇష్టమైన నైవేద్యాన్ని సమర్పించారు. ఇక ప్రధానాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. అనంతరం సుప్రభాతం, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు విశేషంగా చేపట్టారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు.

పొత్తు కుదిరితే సీటెవరికి?

- రసవత్తరంగా మునుగోడు రాజకీయం
- కాంగ్రెస్‌తో దోస్తీ కుదిరితే పోటీకి సీపీఐ సై
- సీపీఐకి కేటాయిస్తే కాంగ్రెస్ భవిష్యత్ ప్రశ్నార్థకం
- ఇప్పటికే కాంగ్రెస్ నుంచి టికెట్ రేసులో చలమల్ల కృష్ణారెడ్డి, పాల్వాయి స్రవంతి



సాక్షి, యాదాద్రి: మునుగోడు రాజకీయం రసవత్తరంగా మారుతోంది. పొత్తు ఉంటుందనుకున్న బీఆర్‌ఎస్ దోస్తీకి చెక్ పెట్టడంతో కాంగ్రెస్ చూపు కమ్యూనిస్టులపై పడింది. పొత్తు ధర్మంలో సీపీఐకి కేటాయిస్తే తమ పరిస్థితి ఏంటని మునుగోడు కాంగ్రెస్ నాయకులు ఆలోచిస్తుండగా, కాంగ్రెస్‌కు కేటాయిస్తే తామేమి చేయాలని కమ్యూనిస్టులు ఆలోచనలో పడ్డారు. కాంగ్రెస్ నుంచి ఇప్పటికే చలమల్ల కృష్ణారెడ్డి, పాల్వాయి స్రవంతి టికెట్ రేసులో ఉన్నారు. వారు నియోజకవర్గంలో ఇప్పటికే ప్రచారం సాగిస్తున్నారు.

ప్రచారంలో కాంగ్రెస్

పొత్తు విషయం ఎలా ఉన్నా తమ పనితాము కానిస్తున్నారు కాంగ్రెస్ ఆశావహులు, పీసీసీ కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి, పాల్వాయి స్రవంతి. ఇప్పటికే నియోజకవర్గంలో తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో సీపీఐతో పొత్తుపై ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నుంచి తనకు హామీ లభించిందన్న భరోసాతో కృష్ణారెడ్డి పోటీకి సిద్ధమయ్యారు. ఉప ఎన్నికలో పోటీ చేసి ఓడిపోయిన స్రవంతి సైతం తనకు టికెట్ వస్తుందన్న ధీమాతో ఉన్నారు. మరి సీపీఐతో పొత్తు కుదిరితే పరిస్థితి ఏమిటన్నది కాంగ్రెస్‌లో ప్రశ్నార్థకంగా మారింది. పొత్తు కుదిరినా కాంగ్రెస్ స్నేహపూర్వక పోటీ చేస్తుందా.. లేక పొత్తు నేపథ్యంలో పోటీ నుంచి తప్పుకుంటారా అన్నది త్వరలో తేలనుంది. అయితే ఉమ్మడి జిల్లాలో సీపీఐ, సీపీఎంకు రెండు సీట్లు ఇవ్వడం కుదరకపోవచ్చని కాంగ్రెస్ సీనియర్ నాయకుడొకరు చెబుతున్నారు.

నువ్వా– నేనా అన్నట్లుగా పోటీ..

మునుగోడు నియోజకవర్గంలో ఇప్పటివరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికలు కాంగ్రెస్, సీపీఐ మధ్యన నువ్వా నేనా అన్నట్లుగా సాగాయి. అయితే మొత్తంగా కాంగ్రెస్‌దే పైచేయిగా ఉంది. సీపీఐ సైతం కాంగ్రెస్‌కు దీటుగానే గెలుస్తూ వచ్చింది. ఆరు సార్లు కాంగ్రెస్ గెలుపొందగా, ఐదు సార్లు సీపీఐ విజయం సాధించింది. రెండు సార్లు బీఆర్‌ఎస్ గెలిచింది. ఇందులో ఐదు సార్లు కాంగ్రెస్‌కు చెందిన పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి విజయం సాధించగా అదే పార్టీ తరఫున కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఒకసారి గెలిచారు. సీపీఐకి చెందిన ఉజ్జిని నారాయణరావు 3 సార్లు, పల్లా వెంకట్ రెడ్డి, ఉజ్జిని యాదగిరిరావులు చెరోసారి గెలవగా, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి రెండుసార్లు గెలుపొందారు.

ఇప్పటివరకు గెలిచింది వీరే..

- పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి (కాంగ్రెస్ పార్టీ) (1967, 1972, 1978, 1983, 1999)
- ఉజ్జిని నారాయణరావు (సీపీఐ), 1985, 1989, 1994
- పల్లా వెంకట్‌రెడ్డి, (సీపీఐ), 2004
- ఉజ్జిని యాదగిరిరావు (సీపీఐ), (2009)
- కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి (బీఆర్‌ఎస్ పార్టీ), 2014, (2022 ఉప ఎన్నిక)
- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, (కాంగ్రెస్ పార్టీ), 2018

మునుగోడు సీటుపై అస్పష్టత

వచ్చే ఎన్నికల్లో మునుగోడు సీటు ఎవరికి కేటాయిస్తారనే విషయంపై జిల్లాలో ఆసక్తి నెలకొంది. మునుగోడు ఉప ఎన్నికల సమయంలో వామపక్షాలతో పొత్తు పెట్టుకున్న కేసీఆర్ ఆ తర్వాత రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో దోస్తీ విషయంలో కమ్యూనిస్టులకు షాక్ ఇచ్చారు. పొత్తు అంశం చర్చించకుండానే సీపీఐ ఆశిస్తున్న మునుగోడు అసెంబ్లీకి బీఆర్‌ఎస్ అభ్యర్థి పేరు ప్రకటించారు. దీంతో కమ్యూనిస్టులు కాంగ్రెస్‌తో పొత్తుపై ఆలోచనలో పడ్డారు. అయితే జిల్లాలోని మునుగోడు, మిర్యాలగూడ స్థానాలను పొత్తులో భాగంగా ఉభయ కమ్యూనిస్టులు చెరో స్థానం కోరే అవకాశం ఉంది. ఈ క్రమంలో మునుగోడును సీపీఐ, మిర్యాలగూడను సీపీఎం కోరుతున్నాయి. ఈ క్రమంలో మునుగోడు స్థానం సీపీఐ కాంగ్రెస్‌ల మధ్యన ఎవరికి దక్కుతుందన్న చర్చ సాగుతోంది. ఒకే జిల్లాలో రెండు స్థానాలను కమ్యూనిస్టులకు కేటాయించే అంశంపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఆసక్తి నెలకొంది.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

సాక్షి,యాదాద్రి: వినాయక చవితి, గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. 18వ తేదీన వినాయక చవితి, 27న గణేశ్ నిమజ్జనం ఉన్నందున మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, శాంతి సంఘం నాయకులు, పోలీసు అధికారులు, వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు ఏర్పాట్లు చేయాలని, పెద్ద విగ్రహ మండపాల వద్ద ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. కమిటీ ప్రతినిధులకు అవసరమైన సూచనలు అందించాలని జిల్లా అగ్నిమాపక అధికారికి సూచించారు. నిమజ్జనానికి సంబంధించి భువనగిరి పట్టణంలో నిర్దేశించిన పాయింట్ల వద్ద పూర్తిస్థాయి బారికేడ్లు, లైటింగ్, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లకు తెలిపారు. నిమజ్జనం పాయింట్ల వద్ద క్రేన్‌లు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వారి వివరాలు ముందుగానే జిల్లా యంత్రానికి అందించాలని మత్స్య శాఖ అధికారిని ఆదేశించారు. అదే విధంగా 108 వాహనాలు, మండల కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు ఉత్సవ కమిటీ మెంబర్లతో సమావేశాలు ఏర్పాటు చేసుకుని గణేశ్ ఉత్సవాలు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేష్ చంద్ర మాట్లాడుతూ.. కమిటీ సభ్యులు ప్రతిఒక్కరూ సహకరించాలని, మండపాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుగానే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. పెద్ద విగ్రహాలను తీసుకొచ్చే ముందు పోలీసులకు చెబితే టోల్‌గేట్ తదితర ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫర్ చేసే విషయంలో, మండపాల్లో ప్రతిష్ఠించే సమయంలో పోలీసు శాఖ సహాయపడుతుందని చెప్పారు. హాస్పిటల్స్, పాఠశాలల వద్ద ఉండే మండపాల్లో ఎక్కువ శబ్దాలతో సౌండ్ సిస్టమ్ ఉండకుండా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు భాస్కరరావు, వీరారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అమరేందర్ గౌడ్, జిల్లా రైతు సమన్వయ సమితి కన్వీనర్ అమరేందర్, జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణి, భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారి జగన్నాథరావు, ఏసీపీలు వెంకటరెడ్డి, శివరాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణకు కేసీఆర్ కృషి



ఆరోగ్య మహిళా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ సునీత, చిత్రంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

యాదగిరిగుట్ట: ఆరోగ్య తెలంగాణగా మార్చేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని యాదగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా క్లినిక్‌ను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ప్రజలంతా స్వాగతిస్తున్నారని తెలిపారు. మహిళలకు వైద్య పరీక్షలు చేయించి, వారిని ఆరోగ్య మహిళగా తయారు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దేశంలో ఎక్కడా ఇలాంటి ఆరోగ్య మహిళా పథకాన్ని ఏ ప్రభుత్వం తీసుకురాలేదన్నారు. సీఎం కేసీఆర్ మహిళలకు అవసరమైన పథకాలను తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. ఆడబిడ్డల కోసం అనేక కార్యక్రమాలు తీసుకువచ్చారని, ఆరోగ్య శ్రీ, న్యూట్రిషన్, కేసీఆర్ కిట్టులను అందజేస్తున్నారని తెలిపారు. మహిళల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారన్నారు. కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ మహిళలందరూ ఆరోగ్య మహిళా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో గుండాల, బీబీనగర్ మండలాల్లో ఈ కేంద్రాలు ప్రారంభమయ్యాయని, ఇటీవల పోచంపల్లి, నారాయణపురం, వలిగొండలో ప్రారంభించుకున్నామని తెలిపారు. ఇప్పుడు యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, డీఎంహెచ్ఓ మల్లిఖార్జున్‌రావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధా, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, వైద్యాధికారి వంశీకృష్ణ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ పార్క్‌తో అభివృద్ధి

తుర్కపల్లి: మండల కేంద్రంలో ఇండస్ట్రియల్ పార్క్‌తో ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత తెలిపారు. గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ కోసం మండల శివారులోని 72 సర్వే నంబర్‌లో 93.21 ఎకరాల స్థలం ఇచ్చిన 42 మంది భూ నిర్వాసితులకు ఒక్కో ఎకరానికి రూ.17 లక్షల 50 వేల చొప్పున మంగళవారం తుర్కపల్లి జేఎం ఫంక్షన్ హాల్‌లో చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్య సుశీల, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఉపేందర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కల్పన, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ సునీత

మల్లాపురం గ్రామానికి జిల్లా స్థాయి అవార్డు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామానికి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా జిల్లా స్థాయి అవార్డు లభించిందని ఎంపీడీఓ ప్రభాకర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్– 2023లో భాగంగా, గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రత, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై గ్రామానికి ఈ అవార్డు వచ్చిందని పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం సర్పంచ్ కర్రె వెంకటయ్య కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నట్లు తెలిపారు.

'టెట్'కు పకడ్బందీ ఏర్పాట్లు

భువనగిరి: ఈ నెల 15న నిర్వహించనున్న టెట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్– 1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్– 2 నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటల తర్వాత, మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత కేంద్రంలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థులను అనుమతించబడదని తెలిపారు. అభ్యర్థులు ఒక రోజు ముందుగానే పరీక్ష కేంద్రాలను పరిశీలించుకోవాలని పేర్కొన్నారు. ఓఎంఆర్ షీట్ పై బ్లాక్ పాయింట్ పెన్నుతో మాత్రమే బబుల్ చేయాలని సూచించారు. తమ వెంట హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదని తెలిపారు. హాల్ టికెట్ పై ఫొటో ప్రింట్ కాని వారు గెజిటెడ్ సంతకం చేయించాలని, ఏదైనా గుర్తింపు కార్డుతో జిల్లా విద్యాశాఖ అధికారిని సంప్రదించాలని పేర్కొన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్ష జరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా టెట్ పరీక్షకు 13 కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఆయా కేంద్రాల్లో పేపర్– 1 పరీక్ష ఉదయం 2,976 మంది, పేపర్– 2 పరీక్షకు 2,822 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

సమ్మెలో ఉద్యోగులు.. సేవలకు ఆటంకం

- 11 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు
- విద్యాశాఖలో కార్యకలాపాలకు తప్పని ఇబ్బందులు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

భువనగిరి: విద్యాశాఖలో కీలకమైన సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని 11 రోజులుగా నిరవధిక సమ్మె చేపట్టడంతో పాటు జిల్లా కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. దీంతో విద్యాశాఖలో రోజువారీ కార్యకలాపాలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. కాంట్రాక్టు ఉద్యోగులు విధులకు గైర్హాజరవుతుండడంతో మండలాల్లో ఎమ్మార్సీ కార్యాలయాలు మూసి ఉంచుతున్నారు.

జిల్లాలో 450 మంది ఉద్యోగులు

జిల్లాలో ప్రస్తుతం 712 పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో వివిధ విభాగాల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీటితో పాటు జిల్లా, మండల విద్యాశాఖ కార్యాలయాల్లో సైతం విధులు నిర్వహిస్తున్నారు. నిత్యం పాఠశాల స్థాయి నుంచి జిల్లా విద్యాశాఖ కార్యాలయం నిర్వహించే కార్యకలాపాల్లో సమగ్ర శిక్ష ఉద్యోగుల పాత్ర కీలకమైంది. జిల్లాలో స్థాయిలో అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్, సిస్టమ్ అనలిస్ట్, డాటా ఎంట్రీ ఆపరేటర్, మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఐఎస్ సమన్వయ కర్తలు, కంప్యూటర్ సిబ్బందిగా స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో క్లస్టర్స్ రిసోర్స్ పర్సన్లుగా వేర్వేరు విభాగాల్లో సుమారు 450 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు పనిచేస్తున్నారు.

నిలిచిన వివరాల నమోదు

సమ్మె కారణంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు విధులకు హాజరుకాకపోవడంతో మధ్యాహ్న భోజనం బిల్లులు, విద్యార్థుల ప్రగతి నివేదికలు, మన ఊరు – మన బడి వివరాలను నమోదు చేయడం, యూడైసీలో విద్యార్థుల వివరాలను నమోదు వంటి పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సమయంలో ఉపాధ్యాయుల వివరాలను క్రోడీకరించి జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి విద్యాశాఖ కార్యాలయానికి పంపిస్తారు. కానీ ఉద్యోగులు విధుల గైర్హాజరుతో మండల కేంద్రాల్లోని ఎమ్మార్సీ కార్యాలయాల్లో ఇబ్బందులు తప్పడం లేదు.

సమాన పనికి సమాన వేతనమివ్వాలి



సమగ్ర శిక్షలో కాంట్రాక్టు ఉద్యోగులకు ఇస్తున్న వేతనం తక్కువగా ఉంటుంది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. ప్రభుత్వం తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి నిబంధనల ప్రకారం వేతనం చెల్లించాలి.

– చైతన్య, సమగ్ర శిక్ష ఉద్యోగి, ఆలేరు

ఉద్యోగ భద్రత కల్పించాలి



సమగ్ర శిక్షలో సుమారు 16 సంవత్సరాల నుంచి కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్నాం. తక్కువ వేతనంతో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా చేస్తున్నాం. కానీ వేతనం మాత్రం తక్కువగా ఉంది. ప్రభుత్వం వెంటనే సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి.

– పాండరి, సమగ్ర శిక్ష ఉద్యోగి, భువనగిరి

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం

సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మె చేయడంతో విద్యాశాఖలో నిర్వహించే రోజు వారీ కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో ఈ ఉద్యోగులతో ఎలాంటి సంబంధం ఉండదు. అంతా ఆన్‌లైన్ ద్వారా జరిగే ప్రక్రియలో అధికారులు ద్వారానే కొనసాగుతుంది. మండలాల్లో మాత్రం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– నారాయణరెడ్డి, డీఈఓ

ప్రతిఒక్కరికీ అకౌంట్ ఉండేలా చర్యలు తీసుకోవాలి

- జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

భువనగిరిటౌన్: ప్రతి ఒక్కరికీ బ్యాంక్ అకౌంట్ ఉండేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకర్ల ప్రత్యేక సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మారుమూల ప్రాంత్రాల నుంచి పట్టణ స్థాయి వరకు ప్రతి ఒక్కరూ బ్యాంక్ అకౌంట్ కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జీరో బ్యాలెన్స్ అకౌంట్స్ ఓపెన్ చేసి డిజిటల్ బ్యాంకింగ్ సేవలందించాలన్నారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని ఓటర్ల జాబితాను అనుసరించి బ్యాంక్ ఖాతాలు లేనివారిని గుర్తించాలని తెలిపారు. ఈ నెలాఖరులోగా రైతు రుణమాఫీ నగదును లబ్ధిదారులకు అందేలా చూడాలని, పంట రుణాలు రెన్యూవల్ చేయాలని పేర్కొన్నారు. తిరస్కరించబడిన 383 మంది రైతులకు సంబంధించిన రుణమాఫీ నగదు వారికి అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖకు, బ్యాంకర్లకు సూచించారు. ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి గ్రౌండింగ్ చేయబడని 14 యూనిట్లను ఈ నెలాఖరులోగా గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. పరిశ్రమల శాఖకు సంబంధించి పీఎంఈజీపీ కింద 53 మంది లబ్ధిదారులకు రుణాలు మంజూరయ్యాయని, వాటిలో 42 మార్జిన్ మనీ అందాల్సి ఉందని, ఆ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. గ్రామీణాభివృద్ధికి సంబంధించి స్వయం సహాయక సంఘాల్లో 1.06 శాతమే నిరర్థక అప్పుల కింద ఉన్నాయని, వీటిని స్పెషల్ డ్రైవ్ ఏర్పాటుతో బ్యాంకర్లకు రెన్యూవల్స్ చేసే విధంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీరామకృష్ణ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి శ్యాంసుందర్, జిల్లా పశుసంవర్థక అధికారి డాక్టర్ కృష్ణ, మెప్మా పీడీ రమేశ్, రిజర్వు బ్యాంక్ ప్రతినిధి విభస్ వ్యాస్, నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డి

బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాం సుందర్‌రావు

వలిగొండ: బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాం సుందర్‌రావు అన్నారు. మంగళవారం వలిగొండ మండలంలోని నాతాళ్లగూడెం, నాగారం, గోకారం గ్రామాల్లో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఏలే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో బీజేపీ జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవీ శ్యాం సుందర్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు కాని హామీలతో ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి కేంద్ర నిధులే తప్ప రాష్ట్ర నిధులు లేవన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. అనంతరం ఢిల్లీలో నిర్మించనున్న అమృత వాటికలకు నాతాళ్లగూడెంలో మట్టి సేకరించారు. కార్యక్రమంలో సీఎన్ రెడ్డి, నాగెల్లి సుధాకర్, పోతంశెట్టి రవీందర్, బందారపు లింగస్వామి, దంతూరి సత్తయ్య, రాచకొండ కృష్ణ, మైసోల్ల మత్స్యగిరి, కనతాల అశోక్‌రెడ్డి, బోళ్ల సుదర్శన్, బచ్చు శ్రీనివాస్, మారోజు అనిల్ కుమార్, దోగిపర్తి సంతోష్, బర్ల మల్లేష్, పోలు నాగయ్య, బుంగమట్ల మహేష్, రాధారపు మల్లేశం, బైరు మల్లేష్, మందుల నాగరాజు, కందుల తానీషా తదితరులు పాల్గొన్నారు.



నాతాళ్లగూడెంలో బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న పీవీ శ్యాంసుందర్‌రావు

క్లుప్తంగా

గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ మృతి


నారాయణ (ఫైల్)

చింతపల్లి: గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ బస్సులోనే మృతిచెందిన ఘటన మంగళవారం చింతపల్లి మండల పరిధిలోని వెంకటంపేట వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండలం బడాయిగడ్డ గ్రామానికి చెందిన ఎస్. నారాయణ దేవరకొండ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం ఉదయం విధులకు హాజరైన ఆయన దేవరకొండ డిపో బస్సులో హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి దేవరకొండకు వస్తుండగా చింతపల్లి మండలంలోని వెంకటంపేట వద్దకు రాగానే ఒక్కసారిగా బస్సులోనే కుప్పకూలాడు. ప్రయాణికులు గమనించి నారాయణకు గుండెపోటు వచ్చిందని గుర్తించి దేవరకొండకు తరలిస్తుండగానే మార్గమధ్యలోనే మృతిచెందాడు. దీంతో ఆర్టీసీ అధికారులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడి దుర్మరణం


రఘు మృతదేహం

పెన్‌పహాడ్: బైక్‌పై వెళ్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ వెంకటరత్నం తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలంలోని పొట్లపహాడ్ గ్రామానికి చెందిన చిట్యాల రఘు(16) బైక్‌పై వెళ్తూ నాగులపాటి అన్నారం గ్రామానికి చేరుకోగానే అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. రఘు తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు అతడిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తల్లి రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

నాగారం ఎంపీఓకు అవార్డు

నాగారం: మండల ఎంపీఓగా పనిచేస్తున్న ధార శ్రీనివాస్ సాహిత్య రంగంలో ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు గాను మంగళవారం 'ది బెస్ట్ సిటీజన్ ఆఫ్ తెలంగాణ' అవార్డును అందుకున్నారు. అర్పిత సాంస్కృతిక స్వచ్ఛంద సేవా సంస్థ 22వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు. అవార్డును రాష్ట్ర ప్రభుత్వ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ చైర్మన్, మాజీ ఎంపీ సముద్రాల వేణుగోపాలచారి, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు, లక్ష్మీకాంతం అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త దైవజ్ఞశర్మ, కేవీ కృష్ణకుమారి, శివనాగు, ప్రభాకర్, గనగ్ల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గుండాల: మండలంలోని అనంతారం గ్రామంలో సోమవారం రాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతారం గ్రామానికి చెందిన వంగ మణెమ్మ దంపతులు ఇటీవల కొత్తగా ఇంటిని నిర్మించారు. భార్యాభర్తలు ఇద్దరు కలిసి ఈ నెల 7న ఇంటికి తాళం వేసి ఉప్పల్‌లో వారి పెద్ద కుమార్తె గృహప్రవేశానికి వెళ్లారు. తిరిగి సోమవారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా దొంగలు ఇంటి వెనుక నుంచి లోపలికి ప్రవేశించి బీరువాలోని రూ.50వేలు చోరీ చేసినట్లు గుర్తించారు. మంగళవారం బాధితురాలు పోలీసులుకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి. యాకన్న తెలిపారు. క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించినట్లు ఎస్‌ఐ వివరించారు.

దారి దోపిడీ ముఠా అరెస్టు


విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న చౌటుప్పల్ ఏసీపీ మొగిలయ్య


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, బంగారు గొలుసు

- నిందితుల్లో ఐదుగురు హిజ్రాలు, ఇద్దరు యువకులు
- కారు, బంగారు గొలుసు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన చౌటుప్పల్ ఏసీపీ మొగిలయ్య

చౌటుప్పల్: దారి దోపిడీకి పాల్పడుతున్న ఐదుగురు హిజ్రాలు, ఇద్దరు యువకులను చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపురం వద్ద మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను చౌటుప్పల్ ఏసీపీ మొగిలయ్య మంగళవారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి పట్టణంలోని క్వారీ మార్కెట్‌కు చెందిన హిజ్రాలు మందాల శ్రావణి, దళాయి రజిత, నడిపుడి మాళవిక, కందిపల్లి స్వర్ణ, కర్రి పద్మ శుభకార్యాలు, పండుగల్లో డ్యాన్స్ చేయగా వచ్చే డబ్బుతో జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే వినాయక చవితి వేడుకల్లో భాగంగా హైదరాబాద్‌లో డ్యాన్స్ ఈవెంట్స్ నిర్వహించేందుకు రాజమండ్రి పట్టణంలోని భవానీపురానికి చెందిన ఫొటోగ్రాఫర్ సానబోయిన దినేష్, కొంతమూర్ బజార్‌కు చెందిన కారు డ్రైవర్ పాశ్వాన్ సాగర్‌తో కలిసి సోమవారం కారులో రాజమండ్రి నుంచి హైదరాబాద్‌కు బయల్దేరారు. మార్గమధ్యలో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామ శివారులో హైవే-9 హోటల్ ఎదురుగా జాతీయ రహదారి పక్కన కారు ఆపారు. కారు డ్రైవర్ సాగర్ హైవే మీదుగా చౌటుప్పల్‌కు వెళ్తున్న లింగోజిగూడెం గ్రామానికి చెందిన ఊదరి రమేష్ అనే యువకుడి బైక్‌ను ఆపాడు. వెంటనే కారులో ఉన్న హిజ్రాలు కిందికి దిగి రమేష్ వద్దకు వెళ్లారు. రమేష్‌తో మాట్లాడుతూనే అతడి మెడలోని తులం న్నర బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. బాధితుడు వెంటనే చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు.

వాహన తనిఖీల్లో పట్టుబడిన ముఠా..

బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న ఈ ముఠా సభ్యులు ప్రయాణిస్తున్న కారును పోలీసులు పట్టుకున్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నిజం ఒప్పుకున్నారు. నిందితుల నుంచి స్విఫ్ట్ కారు, తులంన్నర బంగారు గొలుసు, ఆరు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కోర్టులో రిమాండ్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. ఐదుగురు హిజ్రాలు కలిసి చౌటుప్పల్‌తో పాటు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఘట్‌కేసర్, రంగారెడ్డి జిల్లాలోని అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలకే పాల్పడడంతో వారిపై ఆయా పోలీస్ స్టేషన్‌లలో ఐదు కేసులు నమోదైనట్లు ఏసీపీ పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించడంలో చురుకుగా వ్యవహరించిన ఇన్‌చార్జి సీఐ మహేష్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ జానయ్య, ఎస్‌ఐ యాదగిరిని ఏసీపీ అభినందించారు.

అనాథాశ్రమం నుంచి కుటుంబ సభ్యుల చెంతకు..

- మామూలు మనిషిగా మారిన మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి
- పంజాబ్‌లోని సొంతూరుకు పంపించిన అనాథాశ్రమ నిర్వాహకులు


సందీప్‌కు రైలు టికెట్ ఇచ్చి సొంతూరుకు పంపిస్తున్న అమ్మఒడి అనాథాశ్రమ నిర్వాహకురాలు

యాదగిరిగుట్ట రూరల్: మతిస్థిమితం కోల్పోయి అనాథాశ్రమంలో చేరిన పంజాబ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి ప్రస్తుతం మాములు మనిషి కావడంతో మంగళవారం ఆశ్రమ నిర్వాహకులు అతడిని కుటుంబ సభ్యుల వద్దకు పంపించారు. వివరాలు... పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌కు చెందిన సందీప్‌కు మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో మూడేళ్ల క్రితం యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలోని అమ్మఒడి అనాథాశ్రమంలో నిర్వాహకులు చేర్పుకున్నారు. అతడికి వంగపల్లి గ్రామానికి చెందిన దాత చంద్రగాని జహంగీర్‌గౌడ్ సహకారంతో చికిత్స అందజేయడంతో తిరిగి మాములు మనిషి అయ్యాడు. తనది పంజాబ్ రాష్ట్రమని, ఇంట్లో గొడవపడి వచ్చానని, ఇంకా పెళ్లికాలేదని, ప్లాస్టిక్ డబ్బాలు తయారు చేసే కంపెనీలో పనిచేసేవాడిని అని తెలియజేయడంతో.. వెంటనే అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, ట్రైన్ టికెట్, రవాణా ఖర్చులు సమకూర్చి పంపించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు జెల్లా శంకర్, తన్నీరు సుమిత్ర, మహమ్మద్ అలీ, అంజి తదితరులున్నారు.

వేర్వేరు చోట్ల ఉరేసుకొని ముగ్గురి బలవన్మరణం

మిర్యాలగూడ: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దామరచర్ల మండల కేంద్రంలో రైల్వే ట్రాక్ పక్కన చోటు చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండల కేంద్రంలోని విష్ణుపురం-జాన్‌పహాడ్ రైల్వే ట్రాక్ పక్కన రైల్వే విద్యుత్ స్తంభానికి ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు మంగళవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనా స్థలంలో దొరికిన ఆధారాల మేరకు మృతుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బిలాహిందూపూర్‌కు చెందిన దీపక్‌కుమార్(24)గా గుర్తించారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని, మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు.

యాదగిరిగుట్టలో..

యాదగిరిగుట్ట: పట్టణ పరిధిలోని కొత్తగుండ్లపల్లిలో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పట్టణ సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టకు చెందిన మేత్రి కిషోర్‌కుమార్ (24) యాదగిరి పట్టణ పరిధిలోని కొత్తగుండ్లపల్లిలో ఉన్న హైటెన్షన్ స్తంభం వద్ద ఉన్న చెట్టుకు సోమవారం అర్ధరాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం అటుగా వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించి మృతుడి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. మృతుడు ఇటీవలి కాలంలో జగద్గిరిగుట్ట ప్రాంతంలో దొంగతనానికి పాల్పడ్డాడని, ఆ తర్వాత పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో ఆ అవమానం భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ రమేష్ వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పెన్‌పహాడ్‌లో..

పెన్‌పహాడ్: మద్యం తాగడం మానేయాలని భార్య ఒత్తిడి తేవడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని తంగెళ్లగూడెంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నర్సింగ్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. తంగెళ్లగూడెం గ్రామానికి చెందిన రాచకొండ లింగయ్య (60)కు భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. లింగయ్య భార్య రమణ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకురాలిగా పనిచేస్తుంది. లింగయ్య నిత్యం మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడేవాడు. మద్యం తాగడం మానేయాలని భార్య ఒత్తిడి పెంచడంతో మనస్తాపానికి గురైన లింగయ్య మంగళశారం భార్య పాఠశాలకు వెళ్లిన తర్వాత ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లింగయ్య కుమారుడు ఉపేందర్ ఇంటికి వచ్చేసరికి లింగయ్య ఉరేసుకొని ఉండటం చూసి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి కిందకు దించగా అప్పటికే అతడు మృతిచెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నార్కట్‌పల్లి: గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామ పంచాయతీ పరిధిలోని గంగాదేవిగూడేనికి చెందిన మెండె మధు(24) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడి తల్లిదండ్రులు ముంబైలో ఉంటారు. మధును కూడా ముంబై రావాలని తల్లిదండ్రులు ఒత్తిడి చేయడంతో తనకు ఇష్టం లేక మనస్తాపంతో ఆదివారం నార్కట్‌పల్లి మండల పరిధిలోని గ్రీన్ సిటీ వెంచర్‌లో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గమనించి మధును కామినేని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న మధును మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ నర్సిరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

తుర్కపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు.. తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన తలారి ఆంజనేయులు, మాధవి దంపతులకు కుమారుడు భార్గవ్(5) ఉన్నాడు. ఈ నెల 10న మండల కేంద్రంలోనే తమ బంధువులు మృతిచెందగా ముగ్గురు వారి ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట వైపు వెళ్తున్న కారు భార్గవ్‌ను ఢీకొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ భార్గవ్ మంగళవారం మృతి చెందాడు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి


సంతోష్ (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: అనారోగ్యంతో హోంగార్డు మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలంలోని మాసాయిపేట గ్రామానికి చెందిన బుడిగె సంతోష్‌గౌడ్(38) యాదాద్రి కొండపై హోంగార్డుగా పనిచేస్తున్నాడు. అతడు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లోనే చికిత్స పొందుతున్నాడు. వారం క్రితం అతడి తల్లి చనిపోయింది. దీంతో సంతోష్ ఆరోగ్యం మరింత క్షీణించి మంగళవారం ఉదయం మృతిచెందాడు. వారం రోజుల వ్యవధిలో తల్లి, కుమారుడు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంతోష్ మృతిచెందిన విషయం తెలుసుకున్న తోటి హోంగార్డులు, క్లాస్‌మేట్స్, ఏఆర్ పోలీసులు, ఏఆర్ బాంబ్ స్క్వాడ్ సిబ్బంది కలిసి అతడి కుటుంబానికి రూ.1,04,300 ఆర్థికసాయం అందజేశారు.

పురుగు మందు తాగి యువతి ఆత్మహత్య

చిట్యాల: జీవితంపై విరక్తితో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం చిట్యాల మండలంలోని నేరడ గ్రామంలో చోటుచేసుకుంది. చిట్యాల క్రైం ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరడ గ్రామానికి చెందిన మందుగుల ఎల్లయ్య మూడో కుమార్తె గీత(22)కు వివాహం కాలేదు. గత కొంత కాలంగా మానసిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆమె జీవితంపై విరక్తితో మంగళవారం ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆమెను నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య


కట్ట సందీప్ (ఫైల్)

గరిడేపల్లి: ప్రభుత్వ ఉద్యోగం రాలేదని మనస్తాపంతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. వివరాలు.. గరిడేపల్లి మండలం యర్రగుంట గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు కట్ట శంకర్, కాంతమ్మ దంపతుల కుమారుడు సందీప్(23) ఏడాది క్రితం బీటెక్ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లోనే ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ప్రభుత్వ ఉద్యోగంతో పాటు ప్రైవేటుగా ఉపాధి లభించడం లేదని సందీప్ మనోవేదన చెందుతున్నాడు. ఈ నేపథ్యంలోనే సందీప్ 20 రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చి ఉంటున్నాడు. ఇంట్లో ఆర్థిక పరిస్థితులు దయనీయంగా ఉండడం, తనకు ఉద్యోగం రావడం లేదని మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లిన సమయంలో రాత్రి సందీప్ ఇంట్లోనే ఇనుపరాడ్డుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి కాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

యూరియా కోసం తిప్పలు


రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ బి. వెంకటేశ్వరావు

ఆత్మకూరు(ఎం): మండలంలో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ ఎరువుల దుకాణ వ్యాపారులు యూరియా బస్తాతో పాటు సుమారు రూ. 1000ల విలువ గల పెస్టిసైడ్ మందులు అంటగడుతుండడంతో రైతులు పీఏసీఎస్‌కు బారులు దీరుతున్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల పీఏసీఎస్‌కు 440 బస్తాల యూరియా లోడు రావడంతో విషయం తెలుసుకుని రైతులు ఉదయం ఆరు గంటల నుంచే వచ్చి వరసలో నిల్చున్నారు. ఆలేరు ఏడీఏ బి. వెంకటేశ్వరావు, ఏఓ ఎన్. శిల్ప దగ్గరుండి రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియాబస్తాలను పంపిణీ చేయించారు.

స్వయం సమృద్ధిలో 'ఏపూరు' అద్భుతం


ఉత్తరప్రదేశ్ రాష్ట్ర బృందానికి స్వాగతం పలుకుతున్న ఏపూరు గ్రామస్తులు, అధికారులు


గ్రామ నర్సరీ గురించి వివరిస్తున్న స్థానిక అధికారులు

- గ్రామాన్ని సందర్శించి కొనియాడిన ఉత్తరప్రదేశ్ రాష్ట్ర బృందం

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): స్వయం సమృద్ధి సాధించడంలో ఆత్మకూర్(ఎస్) మండలంలోని ఏపూరు గ్రామ పంచాయతీ పనితీరు అద్భుతమని ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బృందం కొనియాడింది. మహిళా విభాగంలో జాతీయస్థాయి అవార్డు గెలుచుకున్న ఏపూరు గ్రామాన్ని మంగళవారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పంచాయతీరాజ్ అధికారులు, సర్పంచుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు జాతీయ స్థాయి అవార్డు రావడానికి ఏవిధంగా కృషి చేశారని గ్రామ పాలకవర్గాన్ని అడిగి తెలుసుకున్నారు. సంతులిత గ్రామీణ అభివృద్ధిలో భాగంగా మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబన, మహిళల ఆరోగ్యంపై మహిళలకు అవగాహన కల్పించినట్లు ఉత్తరప్రదేశ్ బృందానికి స్థానిక సర్పంచ్ సానబోయిన రజితాసుధాకర్ వివరించారు. అనంతరం గ్రామ వీధుల్లో తిరుగుతూ మహిళా పార్కు, అంగన్‌వాడీ కేంద్రం, మహిళా వ్యాయామశాల, చిల్డ్రన్స్ పార్కు, హెల్త్ సబ్ సెంటర్, వైకుంఠధామం, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్, నర్సరీని పరిశీలించారు. ఏటా ఇంటింటికీ ఆరు మొక్కల పంపిణీ చేస్తున్నట్లు తెలుసుకొని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తమ రాష్ట్రంలోనూ పలు పథకాల అమలుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం గ్రామంలోని బతకమ్మ ఘాట్‌లో బృందం సభ్యులు మహిళలతో కలిసి బతకమ్మ ఆడారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జి. సురేష్, జిల్లా పంచాయతీ అధికారి ఎన్. యాదయ్య, మహిళా సంక్షేమ అధికారి జ్యోతి పద్మ, డివిజనల్ పంచాయతీ అధికారి వి. సాంబిరెడ్డి, ఎంపీడీఓ మల్సూర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి ఉమా పాల్గొన్నారు.

అల్లు అర్జున్‌కు అవార్డు రావడం గర్వకారణం


విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి

హాలియా: సినీనటుడు అల్లు అర్జున్‌కు జాతీయ స్థాయి ఉత్తమ చలనచిత అవార్డు రావడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని అల్లు అర్జున్ మామ, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో కేసీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అల్లు అర్జున్ అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అల్లు అర్జున్‌కు 69వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో భాగంగా జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు రావడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. కేసీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా స్కూల్ బ్యాగులు, సామగ్రిని అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, క్రికెట్ కిట్లు, వాలీబాల్ కిట్లను కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దవూర ఎంపీపీ చెన్ను అనురాధ సుందర్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ అనుముల మండల అధ్యక్షుడు రావుల చినభిక్షం యాదవ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రావుల రాంబాబు, సర్పంచ్‌లు భాస్కర్, బి.శ్రీనివాస్‌రెడ్డి, ఏ.శ్రీనివాస్‌రెడ్డి, జ్యోతిలింగారెడ్డి, విజయ్ యాదవ్, కృష్ణ, ప్రసాద్, గుర్రం హనుమంతు, సంజీవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు.నూతన పట్టువస్త్రాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి ఎదుర్కోళ్లమహోత్సవం చేపట్టారు. అనంతరం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్క పూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వైభవంగా నిర్వహించారు. అదే విధంగా క్షేత్రంలోని ఆలయ పాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మృతి

- చిలుకూరు మండలం చెన్నారిగూడెంలో ఒకరు
- బీబీనగర్ మండలం మాదారం గ్రామంలో మరొకరు..


భిక్షం (ఫైల్)

చిలుకూరు: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన మంగళవారం చిలుకూరు మండలంలోని చెన్నారిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారిగూడెం గ్రామానికి చెందిన పుట్టపాక భిక్షం(63) రోజుమాదిరిగా మంగళవారం తమ పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ విద్యుత్ మోటారు నడవకపోవడం గమనించి.. ఫ్యూజ్ పోయిందనుకొని ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లి విద్యుత్ సరఫరా నిలిపివేసేందుకు యత్నించాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల రైతులు గమనించి భిక్షం కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. మృతుడి కుటుంబ సభ్యులు చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీబీనగర్‌లో..

బీబీనగర్: మండలంలోని మాదారం గ్రామానికి చెందిన ఓ రైతు మంగళవారం వ్యవసాయ బావి వద్ద మోటారు ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఎస్‌ఐ యుగేంధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మాదారం గ్రామానికి చెందిన పగిడాల గోపాల్‌రెడ్డి(60) తన వ్యవసాయ పొలానికి నీళ్లు పెట్టేందుకు మంగళవారం తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లాడు. బోరు మోటారును ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల రైతులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

సూర్యాపేటలో యువకుడు..


మహేష్ (ఫైల్)

మునగాల(కోదాడ): మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన రావులపెంట వెంకన్న, ప్రమీల దంపతుల కుమారుడు మహేష్(24) మంగళవారం సూర్యాపేట పట్టణంలో తాను అద్దెకుంటున్న గదిలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేష్ ఐటీఐ పూర్తిచేసి సంవత్సర కాలంగా సూర్యాపేట పట్టణంలోని 36వ వార్డులో తన మిత్రుడితో కలిసి ఓ గది అద్దెకు తీసుకొని ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం మహేష్ తన గదిలో వాటర్ హీటర్ పెడుతుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి మిత్రుడు లేచి చూసేసరికి మహేష్ అచేతనంగా పడిఉండడంతో చనిపోయినట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. దీంతో మృతుడి తల్లిదండ్రులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. తమ కుమారుడి మృతి అనుమానాస్పదంగా ఉందని మహేష్ తండ్రి వెంకన్న సూర్యాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సూర్యాపేట పోలీసులు కేసు నమోదు చేసుకొని మహేష్ మృతదేహానికి సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

- దత్తాయపల్లి గ్రామ శివారులో ఉరేసుకొని ఆత్మహత్య


ఘటనా స్థలంలో మృతదేహం వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

తుర్కపల్లి: నెల రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామ శివారులో మంగళవారం లభ్యమైంది. వివరాలు.. తుర్కపల్లి మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన గుంటి పాండు (58)కు భార్య మల్లమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆగస్టు 1వ తేదీన పాండు వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి వరకు కూడా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆగస్టు 6వ తేదీన తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌లో భార్య మల్లమ్మ ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా మంగళవారం గొర్రెల కాపరులు తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామ శివారులోని చిత్తరమ్మ గుండ్ల వద్ద కుళ్లిపోయిన మృతదేహాన్ని గుర్తించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పాండు కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహం పాండుదేనని గుర్తించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉంది. చెట్టుకు తాడు కూడా ఉండడంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. సీఐ సురేందర్, ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు.